# లెక్క సరిపోయింది

- ప్రఫుల్లచంద్ర

**ఇరవై ఏళ్ల తర్వాత హఠాత్తుగా ఇంటిలో అడుగుపెట్టిన సుందరం దంపతుల్ని చూసి మొదట నిర్ఘాంతపోయిన భాస్కరం ఆనందాశ్చర్యాలతో ఉక్కిరిబిక్కిరి అవుతూ ఈజీ ఛైర్‌లోంచి లేచి ఒక్క అంగలో స్నేహితుని సమీపించి, కౌగలించుకుని గాలిలోకి ఎత్తేసి గిరగిరా తిప్పేశాడు. కిచెన్‌లోంచి పరుగున వచ్చిన లలిత అన్నపూర్ణని హత్తుకుంది ఆనందంగా.**

**ఇరవై ఏళ్ల జ్ఞాపకాలు తవ్వుకుంటూ ఇంక కబుర్లే కబుర్లు.**

ఈ ఇరవై ఏళ్లలో సుందరం దంపతుల్లో పెద్దగా మార్పు లేకపోయినా, భాస్కరం ఖద్దరు చొక్కా తొడుక్కున్న ఐరావతం లాగా తయారయ్యాడు. మెడనిండా రుద్రాక్షమాలలు, నుదుట విభూతి రేఖ, మధ్య- గంధం, కుంకుమ బొట్టు, వేళ్లకు దిమ్మల్లాంటి ఉంగరాలు! అతని భార్య లలిత మంధర పర్వతం లాగుంది. మెడ తిరగనన్ని నగలు. చేతులనిండా రవ్వల గాజులు. మరి బీరువాల్లో, బ్యాంక్ లాకర్లలో ఎంత ఐశ్వర్యం ఉక్కిరిబిక్కిరి అవుతున్నదో!

అయితే వాళ్లకి కంటినిండా కునుకులేదని వారి కళ్లలో ఎరుపు, కళ్లకింద నలుపూ చెబుతున్నాయి. ఆరోగ్యం లేదని అస్తవ్యస్తంగా పెరిగిన వాళ్ల శరీరాలు చెబుతున్నాయి. మనశ్శాంతి లేదని వాళ్ల స్వరాలు చెబుతున్నాయి. కబుర్లు... భోజనాలు... మరిన్ని కబుర్లు అయ్యాక మహిళలిద్దరూ ఒక మంచం మీద, మగవాళ్లిద్దరూ ఇంకో మంచం మీద సెటిలయ్యారు. ఏసీ గది, చల్లగా హాయిగా ఉంది. నైట్ లాంప్ నీలపుకాంతి గది అంతా పరుచుకుంది.

''నువ్వు వినకపోయినా, ఇరవై ఏళ్ల క్రితం చెప్పిన సలహానే ఇప్పుడూ చెబుతున్నా. లంచాలు మానరా, అవినీతి వద్దురా'' అన్నాడు సుందరం మృదువుగా. కానీ అప్పటికే భాస్కరం గురకతీస్తుండడంతో దీర్ఘంగా నిట్టూర్చి తనూ నిద్రలోకి జారిపోయాడు సుందరం.

కానీ భాస్కరం నిద్రపోవడం లేదు. స్నేహితుడు వేసే హిత బోధనుత్తిని తప్పించుకోవడానికే నిద్ర నటిస్తున్నాడు. నటిస్తూ- ఆలోచిస్తున్నాడు.

పాతికేళ్ల క్రితం ఇద్దరూ ఒకేసారి రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌లో చేరి ఇప్పుడు డిప్యూటీ కలెక్టర్‌స్థాయికి ఎదిగారు. ఉద్యోగం ఉండగానే ఎంత వీలైతే అంతా సంపాదించుకోవాలన్న తత్వం భాస్కరంది. వామి వద్ద కాపలా కుక్క తత్వం సుందరంది. తను తినడు, తినేవాళ్లని చూసి అరుస్తాడు.

''ఎక్కడో కూర్చుని చిత్రగుప్తుడు చిఠా రాస్తాడని కాదు గాని మన అంతరాత్మే మనల్ని నిలదీస్తుంది. మనం చేసే పాపాలకు ప్రతిఫలం ఎక్కడో నరకంలో కాదు. ఇక్కడే ఈ జన్మలోనే అనుభవిస్తాం. అవసరానికి మించిన డబ్బు మనిషిని మృగంగా మార్చుతుంది. క్రమశిక్షణ కోల్పోతాం. విచక్షణ నశిస్తుంది. పట్టుతప్పి అగాధంలోకి జారిపోతాం. అక్రమంగా సంపాదించిందంతా ఊడ్చిపెట్టుకుపోతుంది. చివరకు మిగిలేది సంతోషం కాదు...సంతాపం!'' ఇలా సాగిపోతుంది సుందరం ఉపన్యాసం.

డబ్బే అందం! డబ్బే ఆనందం! డబ్బే ఆరోగ్యం! డబ్బులేనివాడు డుబ్బుకి కొరగాడు- అని తెలిసినా చచ్చు వేదాంతం చెబుతాడు సుందరం. లంచాలు మేసే వాళ్లంతా హాయిగానే ఉన్నారు. నూటికీ కోటికీ ఒకరు పట్టుబడ్డా వాళ్ళూ లంచం మేపి తప్పించుకుంటూనే ఉన్నారు. మనదేశంలో గుమాస్తా మొదలు మంత్రి వరకూ అందరిదీ ఒక్కటే ధ్యేయం. అందినకాడికి మింగడమే. ప్రజలు కూడా అవినీతిపరులనే మళ్లీ మళ్లీ గద్దెనెక్కిస్తున్నారు! ఇదీ భాస్కరం థియరీ.

భిన్న ధృవాలు ఆకర్షించుకుంటాయనడానికి వీళ్ల స్నేహమే ఒక ఉదాహరణ.

రెండు తుఫాన్‌లూ, ఒక ఎలక్షన్ వస్తే చాలు కూతురు వివాహం బ్రహ్మాండంగా జరుపుతారని రెవిన్యూ సిబ్బంది మీద ఒక జోక్.

భాస్కరం కూతురు వివాహం బ్రహ్మాండంగానే చేశాడు. ఏడో క్లాసులో మాస్టార్లకు భారీ బహుమతులిచ్చి, పదో క్లాసులో లీకైన పేపర్లు సంపాదించి, ఇంటర్‌లో మరొకరిచేత పరీక్షలు రాయించి కొడుకుని పాస్ చేయించిన భాస్కరం ఎంసెట్‌లో ఆ పప్పులుడక్క కొడుకుతో బాటు చతికిలబడ్డాడు. అయితే కొడుకు మీద ఖర్చు లాభాలు తెచ్చే పెట్టుబడి లాంటిదే కనుక వెనుకాడకుండా కొడుకుని కర్నాటక ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో చేర్పించాడు. డిగ్రీ కోసం కొంత, ఆతర్వాత ఉద్యోగం కోసం కొంత ఖర్చయింది. వెరసి కొడుకు మీద పెట్టుబడి మొత్తం పాతిక లక్షలని లెక్క తేల్చి ... కట్నం కోసం వేట ప్రారంభించాడు భాస్కరం.

సుందరం కూతురికి సింపుల్‌గా పెళ్లి ... అల్లుడు మంచివాడే. అమ్మాయి సుఖం... కొడుకు ఎంసెట్‌లో మంచి ర్యాంక్ తెచ్చుకుని ... చదివి కార్పొరేట్ ఆస్పత్రిలో డాక్టర్‌గా చేరి ... సంపాదించాడు. అతనికి పెళ్లి కుదిరింది. ఆ ... చెప్పడానికే సుందరం దంపతులు భాస్కరం ఇంటికొచ్చారు. కట్నం లేదు. పెళ్లి సింపుల్‌గా చేస్తాడట.

''డాక్టర్‌కి పదిలక్షలైనా కట్నం గుంజవచ్చు. కానీ ఈ వెర్రివాడు కట్నం తీసుకోడట. వీడిని ఎవరూ ... లేరు'' అని నవ్వుకున్నాడు భాస్కరం-సుందరం... చూసి.

ఇంకో రెండేళ్లలో సుందరం, భాస్కరం ఇద్దరూ రిటైర్ అవుతారు. ఇద్దరికీ సంతృప్తిగానే ఉంది. రెండుకోట్లు సంపాదించి, రిటైర్ అయ్యేలోగా మూడో కోటి సంపాదించగలనన్న సంతృప్తి భాస్కరంది అయితే కంటినిండా కునుకు, మనసు నిండా హాయితో సంసారం సుఖంగా సాగిపోతున్న సంతోషం సుందరంది.

భాస్కరం ఇంట ఒక రోజు ఉండి వెళ్లిపోయారు సుందరం దంపతులు.

★ ★ ★

సుందరం గారబ్బాయి పెళ్లి అయిన ఆరునెలలకే భాస్కరం కొడుకు పెళ్లి ఆర్భాటంగా చేశాడు. అతడు కోరుకున్నట్లే కట్నం, లాంఛనాలూ గిట్టుబాటై లెక్క సరిపోయింది. ఆ పెళ్లి వైభవం చూసి ఎందరి కళ్ళు కుట్టాయో!

పెళ్లి వేడుకలు ముగిసేసరికి రాత్రి రెండైంది. అలిసిసొలిసి భాస్కరం బెడ్‌రూం కెళ్లి మంచం మీద వాలిపోయాడు. అతని మనసెంతో హాయిగా ఉంది. బాధ్యతలన్నీ తీరిపోయాయి. ఇంక మనవలతో ఆడుకోవడమే! అతని మనస్సు ఆనందడోలికల్లో ఊగుతూండగా హఠాత్తుగా దగ్గు వచ్చింది. లోపలి భాగాలన్నీ కదిలిపోయేటంత ఉక్కిరిబిక్కిరిగా, ఊపిరాడనంత ఉధృతంగా.

ముఖం వికృతంగా మారి, మెడ నరాలు ఉబ్బిపోయి విలవిల తన్నుకుంటూ భర్తని చూసి హడలిపోయిన లలిత డాక్టర్‌కి ఫోన్ చేసేలోగా అంతా సర్దుకుంది.

రెండునెలలు గడిచాక మళ్లీ దగ్గు...ఈసారి మరింత ఉధృతంగా.

భార్య పోరు పడలేక డాక్టర్‌ని కలిస్తే అన్ని టెస్ట్‌లూ చేయించి రోగాల లిస్టు ఇచ్చాడాయన. షుగర్ అట! బీపీ అట! అదట! ఇదట! పదిరకాల మందులు రాసి పదిరోజులు పోయాక రమ్మన్నాడు డాక్టర్.

హడలగొట్టి డబ్బు గుంజడం డాక్టర్లకి అలవాటే కదాని మ్మందులేవీ వాడలేదు భాస్కరం. దాంతో మళ్లీ నెలరోజులకు దగ్గి దగ్గి స్పృహ తప్పి పడిపోయాడు. నర్సింగ్ హోంలో చేర్పించారు.

లంచగొండులు రోజూ ఆఫీసుకు వెళ్లకపోతే లంచం ధార ఆగిపోతుంది. ఆ భయంతో రెండు వారాలు మించి నర్సింగ్‌హోంలో ఉండలేకపోయాడు భాస్కరం. తగిన జాగ్రత్తలు తీసుకుంటానని డాక్టర్‌కి హామీ ఇచ్చి డిశ్చార్జి అయి ఆఫీసులో చేరాడు. అయితే మళ్లీ నాలుగు నెలలకు నర్సింగ్‌హోంలో మళ్లీ చేరక తప్పలేదు.

రెండు కిడ్నీలూ పాడైపోయాయి. గుండె కండిషన్ బాగాలేదు. షుగర్, కొలెస్ట్రాల్, బీపీ ఎక్కువైపోయాయి. డాక్టర్ చీవాట్లు పెట్టాడు.

భాస్కరం ఆస్పత్రి మంచం మీద ఉన్నప్పుడే నెత్తిన పిడుగూ, గుండెలో బాంబూ పడిన సంఘటన జరిగింది. ఇంటిమీద ఏసీబీ దాడి! నగదూ, పత్రాలూ సీజ్ చేసి బ్యాంక్ లాకర్లు సీల్ చేశారట. గోడుగోడున ఏడుస్తూ భార్య చెప్పింది. ఏదైనా ప్రతిక్రియ చేద్దామంటే మంచం మీద నుంచి కదలలేని పరిస్థితి. భాస్కరం విలవిలలాడాడు.

కష్టాలు ఒంటరిగా రావు. భాస్కరం కష్టాలు-కొడుకూ, కోడలూ, కూతురూ, అల్లుడూ, ఇద్దరు వియ్యంకుల రూపంలో వచ్చి పడ్డాయి. ఏసీబీ సీజ్ చేసిన ఆస్తులు భాస్కరంవి కావనీ, తమవేనని దొంగపత్రాలు సృష్టించడం ఒక్కటే మార్గం అని వియ్యంకుల సలహా. ''ఆస్తులు మా పేర ఉంటాయి గానీ అనుభవించేది మీ అబ్బాయీ, అమ్మాయే కదా'' అన్నారు వాళ్ళు కూడబలుక్కున్నట్లు.

''బావగారూ! బెంగపడకండి. మీకంటే పెద్ద మింగుడు గాళ్ళు ఏసీబీ లోనూ, రిజిస్ట్రార్ ఆఫీసులోనూ ఉన్నారు. వాళ్ళకో పదిలక్షలు పడేస్తే దొంగ పత్రాలు సృష్టించి తప్పించుకోవచ్చు'' ధైర్యం చెప్పాడు వియ్యంకుడు నెంబర్‌వన్.

''మంత్రిగారి మెదడు, కళ్ళూ, చెవులూ అన్నీ రాజా రంగారావు గారే. ఆయన మాకు బాగా తెలుసు. ఆయనకు మరో పది పడేస్తే అంతా ఆయనే చూసుకుంటాడు.'' భరోసా ఇచ్చాడు నెంబర్ టూ.

భాస్కరం చండప్రచండంగా వెలిగిపోతున్న రోజుల్లో పదేళ్ళక్రితం పోరంబోకు రౌడీ రాస్కెల్ రంగడితో ఘర్షణపడి ఆఫీసు నుంచి గెంటేశాడు. వాడు ఇప్పుడు రాజారంగారావు గారు! వాడికి ఖద్దరు, పసుపు, కాషాయం చొక్కాలున్నాయి. ఏ ఎండకు ఆ చొక్కా తొడుక్కుని పనులు చేయించి పెట్టే ఏజెంటుగా మారి, డబ్బుతో పాటు గౌరవమూ మూటకట్టుకున్నాడు. ఆ రాస్కెల్‌తో తన వియ్యంకులకు లావాదేవీలు.

పైగా వియ్యంకుల మాటతీరులో తేడా వచ్చింది. మునుపటి గౌరవం లేకపోగా వెటకారం ధ్వనిస్తోంది. కొడుకూ, కూతురూ ధోరణి కూడా మారింది.

కుతకుత ఉడికిపోయాడు భాస్కరం.

వాళ్ళు వెళ్లాక సాక్షాత్తూ రాజారంగారావే ప్రత్యక్షం. విలన్‌లాగ నవ్వుతూ

''ఏం భాస్కరం. జ్ఞాపకం ఉన్నానా? పదేళ్ళ క్రితం మిడిసిపాటుతో నన్ను గెంటించావ్! ఇప్పుడు నేనే ఏసీబీ రిపోర్ట్ ఇచ్చి నిన్ను గెంటించాను. రెండురోజుల్లో నీకు సస్పెన్షన్ ఆర్డర్. తర్వాత నీ ఆస్తి జప్తు! పెన్షన్ రద్దు! ఎలా ఉంది నా దెబ్బ!'' అన్నాడు అవహేళనగా.

ఎగిరి వాడి మూతిమీద తన్నాలనిపించింది భాస్కరానికి. కానీ కదలలేడు.

కదలలేని సింహాన్ని చూస్తే పుచ్చుకుక్కకీ చెలగాటమే. ఎగతాళిగా నవ్వుతూ

''నువ్వు నాకెంత అపకారం చేసినా, నేను నీకొక ఉపకారం చేస్తానులే. ఈ ఆస్తి నీది కాదనీ, నీ వియ్యంకులదనీ దొంగ పత్రాలు సృష్టిస్తాను. దాంతో నీకు జైల్లో చిప్పకూడు తప్పుతుంది. పెన్షన్ దక్కుతుంది. ఎలా ఉంది నా ఐడియా!'' అడిగాడు.

భాస్కరం ఏదో అనేలోగా సుందరం దంపతులు రాగా వాళ్లకి వినయంగా నమస్కారాలు చేసి వెళ్లిపోయాడు రంగారావు.

ఆత్మీయుల్ని చూడగానే లలిత దుఃఖం కట్టలు తెంచుకుంది. అన్నపూర్ణ మీద వాలిపోయి వియ్యంకుల కుతంత్రం, రంగారావు ఆడుతున్న నాటకం, వాళ్లచేతుల్లో కీలుబొమ్మలైపోయిన తన కూతురూ, కొడుకూ గురించి చెప్పుకుంది.

స్నేహితుని చెయ్యిని నిమురుతూ ''నిజం నిష్ఠూరంగా ఉంటుంది కానీ రంగారావుకీ నీకూ తేడా ఏమిటిరా? వాడు నీ భావాలనే, నీ భాషలోనే చెప్పాడు. అనారోగ్యం వల్ల కదలలేకపోతున్నావ్ గానీ లేకుంటే నువ్వు కూడా లక్షలు వెదజల్లి ఈ ఆస్తి నాది కాదు ఫలానా వారిది అంటూ దొంగ పత్రాలు సృష్టించడానికి బయలుదేరవా?'' మృదువుగా అన్నాడు సుందరం. కళ్ళు మూసుకుని ఆలోచనలో పడ్డాడు భాస్కరం.

అంత విపత్కర పరిస్థితిలోనూ అతనిలో ఏదో ఆశ రెపరెపలాడుతోంది. ఆ ఆశ పేరు రుషీ బ్యాంక్. దోచుకున్న డబ్బు దాచుకోవడానికి స్విస్ బ్యాంక్ కన్నా భద్రమైన బ్యాంక్ అది. దాని వ్యవస్థాపకుడు ఇరవై ఏళ్ల క్రితం భాస్కరం వద్ద అటెండర్! భాస్కరం తరపున లంచాలు వసూలు చేసి, న్యాయమైన కమీషన్ తీసుకునే విశ్వాసపాత్రుడు. రెవెన్యూ ఆఫీసు కొచ్చే పెద్దల్ని అల్లుకుపోయి, అటెండర్ ఉద్యోగానికి రాజీనామా చేసి సహకారబ్యాంక్ ప్రారంభించి స్విస్ బ్యాంకుల విశ్వసనీయత కల్పించాడు.

ఆ బ్యాంక్‌లో పాతిక లక్షలు పైగా తన డబ్బుంది. దాని మీద ఏసీబీ కళ్ళుపడలేదు. ఆ డబ్బుతో తన సమస్య తనే పరిష్కరించుకోగలడు ఆ రాస్కెల్ రంగా ప్రమేయం లేకుండా. ఆ భావం కలగగానే భాస్కరం హృదయం తేలికపడింది. కళ్ళు తెరిచి ''సుందరం! ఒకసారి రుషీ రావుని తీసుకొస్తావా?'' అడిగాడు.

''ఇంకెక్కడి రావు! నిన్ననే బోర్డు తిప్పేసి పరారీ అయ్యాడు''

అంతే భాస్కరం గుండె బద్దలైంది. రెపరెపలాడిన ఆశాదీపం ఆరిపోయింది. చిన్న పిల్లాడిలా బావురుమని ఏడ్చేశాడు. సుందరం సముదాయిస్తూనే ఉన్నాడు. మర్నాటికి గానీ తేరుకోలేదు భాస్కరం.

''భాస్కరం! నీ సమస్యలకూ, నీ జబ్బులకూ డబ్బే కారణం! ఎలా వచ్చిన డబ్బు అలాగే పోయింది. లెక్క సరిపోయింది. ఇంక నీ సమస్యలూ పోతాయి. జబ్బులూ పోతాయి. నేను ప్రతి సంవత్సరం విరాళం ఇస్తున్న ప్రకృతి ఆశ్రమం ఒకటుంది. వాళ్లతో చెప్పి అక్కడ నీకొక కుటీరం ఇప్పిస్తాను. ప్రకృతి మాత ఒడిలో, మళ్లీ డబ్బు జబ్బు సోకకుండా ప్రశాంతంగా కొత్త జీవితం ప్రారంభించు. నీ పెన్షన్‌లో సగం విరాళంగా ఇస్తే చాలు. నీ జీవితం ఎంత అందంగా, హాయిగా సాగిపోతుందో నువ్వే చూస్తావ్. రిటైర్ అయ్యాక మేమూ అక్కడికే వచ్చేస్తాం'' అన్నాడు సుందరం ఆత్మీయంగా.

ఆత్మబంధువుని కనులారా చూస్తూ అలాగే ఉండిపోయాడు భాస్కరం.

